స్వాగతం పలికి.. అంబేద్కర్ చిత్రపటాన్ని అందించి..

హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్నాసాగర్‌కు వెళ్తున్న భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితకు జాగృతి, బీఆర్ఎస్ నాయకులు పట్టణ బైపాస్ రోడ్డులో మంగళవారం ఘనస్వాగతం పలికి అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ కవిత వెంట మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో జాగృతి కన్వీనర్ ముస్తఫా, నాయకులు రాజ్యలక్ష్మి, ఉదయ్‌బాలాజీ, మల్లేశ్, రమేశ్, విజయలక్ష్మి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

-షాద్‌నగర్ టౌన్, జనవరి 9

ఆర్టీసీ కార్మికుల వనభోజనాలు

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 9 : ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో మంగళవారం వనభోజనాల కార్యక్రమాన్ని ఆర్టీసీ కార్మికులు నిర్వహించారు. వనభోజనాల కార్యక్రమానికి డిప్యూటీ ఆర్ఎం సుచరిత హాజరై మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులంతా బాగా కష్టపడి పనిచేస్తున్నారని అన్నారు. ఇదే స్ఫూర్తితో ఇంకా పనిచేసి ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకటరత్నం, హయత్‌నగర్,1, 2 డిపో మేనేజర్లు విజయ్‌కుమార్, శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, అసిస్టెంట్ మెకానికల్ మేనేజర్ సత్తయ్య, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో ముందున్న భారత్

- దానికి చంద్రయాన్-3 ముఖ్యకారణం
- రంగారెడ్డి జడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి
- విద్యారంగానికి అధిక ప్రాధాన్యం : ఎమ్మెల్యే రంగారెడ్డి
- గురుకుల విద్యాపీఠంలో ఘనంగా ప్రారంభమైన జిల్లాస్థాయి సైన్స్ విజ్ఞాన సదస్సు

జ్యోతిప్రజ్వలన చేసి జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎం రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ప్రయోగాలను తిలకిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్, జనవరి 9 : సాంకేతిక రంగంలో నేడు భారత్ దూసుకుపోతున్నదని.. దానికి చంద్రయాన్-3 ముఖ్యకారణమని రంగారెడ్డి జడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠంలో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. మానవ జీవితం సైన్స్‌తో ఎంతో ముడిపడి ఉన్నదని..విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ విద్యారంగాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. సైన్స్ పరిజ్ఞానంతో మానవ జీవితం ముడిపడి ఉన్నందున ప్రతి ఒక్కరూ సాంకేతిక రంగంపై దృష్టి సారించాలన్నారు. చంద్రయాన్-3 ప్రయోగంతో భారత్ ఎంతో ఘనకీర్తిని సాధించిందన్నారు. విద్యార్థులు విభిన్నంగా ఆలోచించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతుల్లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. విద్యావ్యవస్థను పటిష్టం చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రభుత్వ బడుల్లో వసతుల కల్పనకు ఎమ్మెల్సీ సీడీపీ నిధులను కేటాయిస్తానని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ సైన్స్ అంటేనే తెలుసుకోవడం అని, ఒక్క చిన్న ప్రశ్న నుంచే ఎంతో మేథోమథనం జరిగి కొత్త ఆవిష్కరణలు వస్తాయని.. విద్యార్థులందరూ ఇలాంటి విశ్లేషణాత్మక ఆలోచనలను బాల్యదశ నుంచే అలవాటు చేసుకుని భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు పలు రకాల ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. మొక్కలకు సంబంధించిన విషయంపై శ్రీనిధి అనే విద్యార్థినిని ప్రశ్నించగా ఆమె సరైన సమాధానం చెప్పడంతో సర్‌ప్రైజ్ బహుమతిని జడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్యే చేతుల మీదుగా చిన్నారికి జిల్లా అదనపు కలెక్టర్ అందజేశారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున హాజరైన విద్యార్థులు 300 రకాల నమూనాలను ప్రదర్శించగా.. వాటిని జడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్, డీఈవో సుశీందర్‌రావు తిలకించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, జడ్పీటీసీ మహిపాల్, ఎంఈవో వెంకట్‌రెడ్డి, గురుకుల విద్యాపీఠం ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రావు, డీసీఈబీ సెక్రటరీ రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా గురుకుల విద్యాపీఠం ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావును ముఖ్య అతిథులు అభినందించారు.

వృద్ధురాలి నిలువు దోపిడీ

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

మంచాల, జనవరి 9 : ఓ నిర్మానుష్య ప్రాంతంలో వృద్ధురాలిని బెదిరించి మెడలో ఉన్న రెండు తులాల బంగారంతోపాటు నగదును ఆటో డ్రైవర్ ఎత్తుకెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంచాల సీఐ కాశీవిశ్వనాథ్ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా లింగంపేట మండలం సంగారెడ్డిపేట గ్రామానికి చెందిన కొవ్వూరు లక్ష్మి నగరంలోని మీర్‌పేటలో ఉన్న చిన్న కూతురు వద్ద ఉంటున్నది. లక్ష్మి ప్రభుత్వం అందజేస్తున్న వృద్ధాప్య ఫించన్ కోసం ఈ నెల 7న సంగారెడ్డిపేటకు వెళ్లి పింఛన్ తీసుకొని తిరిగి హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్ బయట సాయంత్రం దిగిందని చెప్పారు. అక్కడ ఓ ఆటో డ్రైవర్ మీర్‌పేట వెళ్తున్నానని చెప్పడంతో ఆటో ఎక్కింది. ఆమె మెడలో ఉన్న బంగారాన్ని చూసిన డ్రైవర్ నగరానికి దూరంలో ఉన్న మంచాల మండలంలోని రంగాపూర్ సమీపంలో ఉన్న అబ్బ్రేవేటరీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఆమెను బెదిరించి రెండు తులాల బంగారంతో పాటు 5వేల నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కున్నాడు. బాధితురాలు స్థానికుల సహాయంతో ఆమె తన కూతురుతో.. జరిగిన మోసంపై సమాచారమివ్వడంతో వారు మంగళవారం మంచాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు వేగవంతం చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

డాటా ఎంట్రీలో నిర్లక్ష్యం..!

సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కితే పరిస్థితి ఏంటి

- ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న విద్యార్థులు
- వివరాల నమోదు క్రమంలో అధికారుల పర్యవేక్షణ కరువు
- ప్రైవేట్ సంస్థలకు బాధ్యతలు అప్పగింతపై ప్రజల ఆందోళన

మొబైల్ మాట్లాడుతూ ప్రజా పాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న విద్యార్థి

తుర్కయంజాల్, జనవరి 9 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అభయహస్తం దరఖాస్తులను గత నెల 28 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు స్వీకరించింది. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఈ నెల 17 వ తేదీ లోపు కంప్యూటరీకరిస్తామని స్పష్టం చేసింది. అయితే అత్యంత గోప్యంగా ఉంచాల్సిన సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, ప్రైవేట్ సంస్థలకు అప్పగించడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. డాటా భద్రమేనా.. ? అది సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కితే పరిస్థితి ఏంటని భయాందోళన చెందుతున్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలో 22,834 దరఖాస్తులు ప్రజాపాలనలో అధికారులకు అందాయి. వాటిని ఆన్‌లైన్ చేసేందుకు మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ పాల్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీలోని కంప్యూటర్ ల్యాబ్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ఇందుకుగాను 37 మంది పనిచేస్తుండగా అందులో సుమారు 20 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు, ప్రైవేట్ కంపెనీల్లో పని చేస్తున్న వారే ఎక్కువగా ఉన్నారు. ఒక్క దరఖాస్తును కంప్యూటరీకరించినందుకు వారికి రూ.15 అందజేయనున్నట్లు సమాచారం. అయితే విద్యార్థులు సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. వివరాల నమోదు క్రమంలో అధికారుల పర్యవేక్షణ లోపించింది. మొబైల్‌లో మాట్లాడుతూ ఎంట్రీ చేస్తున్న క్రమంలో ఏమైనా తప్పులు దొర్లితే చిన్న తప్పునకు లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలకు అనర్హులు అయ్యే అవకాశం ఉన్నది.

ఆన్‌లైన్ మోసాలకు డాటా వెళ్లే అవకాశం..

సెల్‌ఫోన్ నంబర్ ఆధారంగా రూ. లక్షలు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల వివరాలు వెళ్తే అనర్థాలు జరుగుతాయని ప్రజలు భయపడుతున్నారు. ఎందుకంటే దరఖాస్తుల్లో ప్రజల ఆధార్ కార్డుతో పాటు సెల్‌ఫోన్ నంబర్లను ఎంట్రీ చేశారు. వాటిని సైబర్ నేరగాళ్లు దొంగిలిస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యత కలిగిన వ్యక్తుల ద్వారా ప్రజాపాలన దరఖాస్తులను కంప్యూటరీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల రూరల్, జనవరి 9 : గ్రామాల్లోని ప్రజలు ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ డీజీఎం బాలానంద్ అన్నారు. మండల పరిధిలోని దేవునిఎర్రవల్లిలో గ్రామంలో మంగళవారం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరణలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు డీజీఎం బాలానంద్ మాట్లాడుతూ.. కేసీసీ క్రాప్ లోన్స్‌ను సమయానికి రెన్యువల్స్ చేసుకోవాలని, కేసీసీ, ఎస్‌హెచ్‌జీ లోన్స్, పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై స్కీమ్స్‌పై అవగాహన కల్పించారు. ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులకు స్వయం సిద్ధ స్కీమ్ ద్వారా రూ.లక్ష నుంచి 5 లక్షల వరకు లోన్స్ తీసుకునేందుకు వీలుకల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఏజీఎం మధుబాబు, సీఎం(క్రెడిట్) బికాస్ సాహో, ఎస్‌బీఐ చేవెళ్ల బ్రాంచ్ మేనేజర్ సంధ్యారెడ్డి, దేవునిఎర్రవల్లి సర్పంచ్ సామ మాణిక్యరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కడ్తాల్, జనవరి 9 : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పీఆర్టీయూ సంఘం సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ మండలాధ్యక్షుడు చీమర్ల రాధాకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మావతమ్మ, మండల బాధ్యులు కిశోర్‌కుమార్, లక్ష్మారెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం : పీఆర్‌టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సరం 2024 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, కేశవులు, రాజిరెడ్డి, నర్సింహ, కరుణాకర్‌రెడ్డి, అదృష్టరావు, కృష్ణ, కరుణాకర్, పవన్ పాల్గొన్నారు.

స్కావెంజర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

కొత్తూరు :ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు, నందిగామ మండలాల పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయసాగర్, రాఘవేందర్, ఆంజనేయులు, ప్రభాస్‌కుమార్, మధుసూదన్ రెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, బాబురావు, బసవేశ్వర్ పాల్గొన్నారు.

షాబాద్ : షాబాద్ మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్-2024 క్యాలెండర్‌ను మంగళవారం హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్, కృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోవింద్, లక్ష్మణ్, సునీత, సంఘం సభ్యులు నర్సింహులు, అంజయ్య, జయరాజ్, రవీందర్, ఖాజాపాషా, ఆంజనేయులు, రియాజ్, రాము, సునీత, లింగం తదితరులున్నారు.

వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలి

షాబాద్, జనవరి 9: ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని ఎంపీడీవో అనురాధ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు చేస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 41 గ్రామ పంచాయతీలకు సంబంధించి ప్రజాపాలన కార్యక్రమంలో 15,991 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 45శాతం ఆన్‌లైన్ నమోదు పూర్తైందని తెలిపారు. గడువులోగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆమె వెంట ఎంపీవో హన్మంత్‌రెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.

మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం, జనవరి 9 : గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని మంగల్‌పల్లి గ్రామ సమీపంలో జరిగింది. ఇబ్రహీంపట్నం పోలీసుల కథనం ప్రకారం.. మంగల్‌పల్లి గ్రామానికి చెందిన కాలే రాజ్‌కుమార్ అదే గ్రామానికి చెందిన గుండ్ల శ్రీశైలం వ్యవసాయ భూమిని కౌలుకు చేస్తున్నాడు. మంగళవారం ఉదయం పక్క పొలంలో కౌలుకు చేసే యాదయ్యతో కలిసి యాదయ్య బండి కోసం నట్లు, బోల్ట్‌లు తెచ్చేందుకు శ్రీశైలం పొలంలోని రేకుల షెడ్డులో ఉన్న రూమ్‌ను ఓపెన్ చేశారు. ఆ రూంలో గుర్తుతెలియని మహిళ చనిపోయి, కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో వెంటనే వారు 100కు డయల్ చేశారు. స్పందించిన పోలీసులు అక్కడకు చేరుకుని విచారించారు. మహిళకు సుమారు 50-55 సంవత్సరాలు ఉండవచ్చని తెలిపారు. ఈ విషయంపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిస్టరీగా యువతి హత్య కేసు

- నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి
- కీలకంగా సెల్‌ఫోన్ డాటా

మొయినాబాద్, జనవరి 9 : యువతి హత్య కేసు దర్యాప్తును మొయినాబాద్ పోలీసులు ముమ్మరం చేశారు. నిందితులను పట్టుకునేందుకు విభిన్న కోణాల్లో పరిశీలిస్తున్నారు. మృతదేహం వద్ద లభించిన సెల్‌ఫోన్ డాటా కేసు దర్యాప్తులో కీలకం కానున్నది. సోమవారం మధ్యాహ్నం బాకారం సమీపంలోని రోడ్డుపక్కన ఓ యువతి మృతదేహంపై పెట్రోలు పోసి గుర్తుతెలియని దుండగులు తగులబెట్టిన విషయం తెలిసిందే. మృతదేహం వద్ద లభించిన సెల్‌ఫోన్‌ను పోలీసులు ఇప్పటికే ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అందులోని సమాచారం తెలిస్తే కేసులో కొంత పురోగతి సాధించొచ్చనే ఆలోచనలో పోలీసులున్నారు. అంతే కాకుండా రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో 25 ఏండ్లలోపు ఉన్న వారి మిస్సింగ్ కేసులు ఏమైనా నమోదయ్యాయా అని మొయినాబాద్ పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే ఎక్కడా హత్యకు గురైన యువతి వయసు ట్యాలీ కావడంలేదని సమాచారం. దుండగుల్లో ఎవరైనా మొయినాబాద్ ప్రాంతానికి చెందిన వారు ఉన్నారా..? లేదా దుండగులకు ఈ ప్రాంతం తెలుసా..? అనే కోణంలోనూ విచారిస్తున్నారు. మంగళవారం చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్యకు గురైన యువతి మృతదేహం తగులబెట్టిన సమయంలో వాహనదారులు ఎవరైనా చూశారా అనే కోణంలో దర్యాప్తు చేశారు. చుట్టుపక్కల పొలాలున్న రైతులు, దారి వెంబడి వ్యవసాయ క్షేత్రాల్లో పని చేసే వారిని కూడా ఆరా తీశారు.

స్టడీ మెటీరియల్ అందజేత

మంచాల : వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఎంఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్స్‌ను జడ్పీటీసీ నిత్య అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, జగన్‌రెడ్డి, డబ్బీకార్ మమత, వహీదాబేగం, మాజీ ఎంపీపీ నిరంజన్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు

యాచారం : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంఎన్ఆర్ యువసేన ఫౌండేషన్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గున్‌గల్, నందివనపర్తి, మేడిపల్లి, కొత్తపల్లి, చింతపట్ల, తులేఖుర్దు గ్రామాల్లోని పదవ తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను అందజేశారు.

జిల్లా ఓటర్లు 35,57,415

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ముసాయిదా విడుదల చేసిన ఎన్నికల సంఘం

అసెంబ్లీ ఎన్నికల తర్వాత 56 రోజుల్లోనే పెరిగిన 34,196 మంది ఓటర్లు

ప్రస్తుతం జిల్లాలో ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఇబ్రహీంపట్నం	1,67,359	1,63,786	36	3,31,181
ఎల్బీనగర్	3,09,631	2,84,244	129	5,94,004
మహేశ్వరం	2,83,763	2,68,257	65	5,52,085
రాజేంద్రనగర్	3,08,098	2,84,105	42	5,92,245
శేరిలింగంపల్లి	3,92,877	3,48,187	148	7,41,212
చేవెళ్ల	1,34,897	1,31,689	04	2,66,590
కల్వకుర్తి	1,22,884	1,19,262	07	2,42,153
షాద్‌నగర్	1,19,698	1,18,233	14	2,37,945
మొత్తం	18,39,207	17,17,763	445	35,57,415

రంగారెడ్డి, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా ఓటరు ముసాయిదా జాబితాను రెండు రోజుల క్రితం ఎన్నికల సంఘం ప్రకటించింది. మొత్తం జిల్లా ఓటర్లు 35,57,415 మంది ఉన్నట్లుగా లెక్క తేల్చారు. వీరిలో పురుషులు 18,39,207, స్త్రీలు 17,17,763, ఇతరులు 445 మంది ఉన్నారు. గత ఏడాది చివరలో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల ముందు నవంబర్ 10న ఎన్నికల సంఘం జిల్లా తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. దీనిలో జిల్లా మొత్తం ఓటర్ల సంఖ్య 35,23,219గా లెక్క తేలింది. తాజాగా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మళ్లీ ఎన్నికల సంఘం ఓటు నమోదుకు అవకాశం కల్పించింది. దీంతో మరోసారి కొత్తగా ఓటు కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. నవంబర్‌లో విడుదల చేసిన తుది ఓటరు జాబితాతో పోలిస్తే ప్రస్తుత ముసాయిదా ఓటరు జాబితాలో కొత్తగా 34,196 మంది ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారు. సుమారు 56 రోజుల వ్యవధిలోనే జిల్లా ఓటర్ల సంఖ్య మరింతగా పెరిగింది.

22 వరకు అభ్యంతరాల స్వీకరణ

జిల్లా ఓటరు ముసాయిదా జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ప్రదర్శించారు. వీటిలో ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 22 వరకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది. వచ్చిన అభ్యంతరాలను ఫిబ్రవరి 2న పరిష్కరిస్తారు. ఫిబ్రవరి 8న ఓటరు తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది. ఈ జాబితాలో ఉన్న వారందరూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

హామీలను అమలు చేస్తాం

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 9 : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ రవీందర్‌దత్తు ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న 21 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అతి త్వరలో రూ.500లకే ఇంటింటికీ గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వడం మొదలుపెడుతామన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రభుత్వంపై నమ్మకం, విశ్వాసం ఏర్పడిందన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రేఖ, జడ్పీటీసీ దాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డి, ఎంపీడీవో మమతాబాయి, ఆర్ఐ నిజాముద్దీన్, సర్పంచ్‌లు వెంకటేశ్, రంగయ్య, సుధాకర్‌రెడ్డి, వీరస్వామి గౌడ్, లతశ్రీ, మల్లేశ్, మహేశ్, ఎంపీటీసీలు వెంకటేశ్, బాలమ్మ, బాలలింగస్వామి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్‌పాషా, నాయకులు ఉన్నారు.

15 లోగా దరఖాస్తు చేసుకోవాలి

యాచారం, జనవరి 9 : గురుకుల కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికిగాను ఇంటర్ మొదటి ఏడాదిలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు శంషాబాద్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ యాదయ్య మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం టెన్త్ చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహించి అర్హులను తీసుకుంటామని.. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15 చివరి తేదీ అని .. విద్యార్థి వయసు 31 ఆగస్టు 2024 నాటికి 17 ఏండ్లు మించొద్దన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెండు నెలల మినహాయింపు ఉందన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులున్నాయని.. ప్రతి గ్రూపులోనూ 40 చొప్పున సీట్లు ఉంటాయన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు నీట్, కాట్, ఐఐటీ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ ఉంటుందన్నారు.

అధికారులు జవాబుదారీగా ఉండాలి

- నాగర్‌కర్నూలు ఎంపీ రాములు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

ఆమనగల్లు, జనవరి 9 : అధికారులు, ప్రజాప్రతినిధులు జవాబుదారీగా ఉండాలని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ నేనావత్ అనిత అధ్యక్షతన జరిగింది. ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా సభ్యులు గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ రాములు మాట్లాడుతూ మండల పరిధిలో మేడిగడ్డ వద్ద నిర్మిస్తున్న వంతెన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా డీ-82 కాలువ పనులను ఆగస్టు లోగా పూర్తి చేస్తామని..భూములు కోల్పోయిన రైతులకు పరిహారాన్ని ఇస్తామన్నారు. అలాగే మండలంలో ప్రభుత్వ దవాఖానను వంద పడకలకు అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. సమావేశంలో జడ్పీటీసీ అనురాధ, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, ఎంపీటీసీలు కుమార్, సరిత, తహసీల్దార్ లలిత, ఎంపీడీవో ఫరూఖ్‌హుస్సేన్, సీడీపీవో సక్కుబాయి, ఎంఈవో సర్దార్‌నాయక్, మండల వ్యవసాయ అధికారి అరుణ, మెడికల్ ఆఫీసర్ పరీక్షిత్, పశువైద్యాధికారి విజయ్‌కుమార్, సత్యం, వెంకట్‌రెడ్డి, శ్రీలత, తిరుపతి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆలయ భూములకు కంచె ఏర్పాటు

కడ్తాల్, జనవరి 9: మండల కేంద్రంలోని ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్న నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. కడ్తాల్ గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన భూములు సర్వే నంబర్ 76లో 6.05 ఎకరాలు, 120లో 15.31 ఎకరాలు, 125లో 9.32 ఎకరాలు, మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో సర్వే నంబర్ 130లో 3.06 ఎకరాలు ఉన్నాయి. ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆరోపణలు రావడంతో అధికారులు ఏడీ ద్వారా సర్వే నిర్వహించారు. మంగళవారం దేవాదాయ శాఖ ఈవో మోహన్‌రావు, మండల ఇన్‌చార్జి స్నేహలత, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, గ్రామ పెద్దలతో కలిసి ఆలయ భూములకు కంచె ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఏవో మోహన్‌రావు మాట్లాడుతూ సర్వే రంబర్ 120లో ఆక్రమణకు గురైన 1.28 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నామని, ఇదే సర్వే నంబర్‌లో మరో 26 గుంటల భూమి అన్యాక్రాంతమైందని మూడు రోజుల్లో సమీప రైతు వ్యవసాయ పొలానికి సర్వే నిర్వహించి సదరు భూమికి కంచె ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సర్వే నంబర్ 130లో 128 గజాల్లో వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టారని, అన్మాస్‌పల్లి గ్రామంలో 222 గజాల్లో వాటర్‌ట్యాంక్, గ్రామ పంచాయతీ భవన నిర్మాణం, పాఠశాల నిర్మించడం జరిగిందని వివరించారు. వీటికి సంబంధించి పంచాయతీ కార్యదర్శికి నోటీసులు అందించినట్లు తెలిపారు. సర్వే నంబర్ 125లో ఆలయ భూమికి కంచె ఏర్పాటు చేస్తుండగా, సమీప వెంచర్ నిర్వాహకుడు కంచె ఏర్పాటు చేయకుండా అధికారులు, ప్రజాప్రతినిధులను అడ్డుకున్నారు. సదరు భూమి తమదేనని, ఆలయానికి సంబంధించింది కాదని అధికారులతో వాదనకు దిగారు. రెండు, మూడు రోజుల్లో మరోసారి భూమికి సర్వే చేపడదామని, అప్పటి వరకు కంచె ఏర్పాటు చేయవద్దని అధికారులను వారు కోరారు. సర్వేకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఒప్పుకోవడంతో గొడవ సద్దుమణిగింది.